క్లుప్తంగా

ఆపద మిత్ర శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

పరకాల : ఈనెల 28వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు ఆపద మిత్ర శిక్షణకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు అగ్నిమాపక అధికారి భద్రయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల వయస్సు గల వారు 7వ తరగతి, ఆపై తరగతులు ఉత్తీర్ణులైనవారు ఆపదమిత్ర శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రవాణా భత్యం, భోజన సౌకర్యంతో పాటు వసతి కల్పించనున్నట్లు తెలిపారు. పరకాల పట్టణానికి చెందిన వారికి స్థానికంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. హనుమకొండకు చెందిన వారికి మడికొండలోని దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ ప్రాంగణంలో శిక్షణ కల్పించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు (హనుమకొండ), 8712699304, (పరకాల)8712699306ను సంప్రదించాలని అగ్నిమాపక అధికారి కోరారు.

మద్యం సేవిస్తున్న వారిపై కేసు నమోదు

వేలేరు : బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సురేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా బహిరంగంగా మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని, ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వీఓఏ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



శాయంపేట : మండల కేంద్రంలోని సురేఖ మండల సమాఖ్య వీఓఏల యూనియన్ నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బడుగు విజయ శనివారం తెలిపారు. గౌరవ అధ్యక్షురాలుగా గంది శోభారాణి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బత్తుల ప్రభాకర్, అధ్యక్షురాలుగా గందె సుహాసిని, ఉపాధ్యక్షురాలుగా షబాన, కార్యదర్శిగా వైద్యుల కవిత, కోశాధికారిగా అబ్బు విజయ, సహాయ కార్యదర్శిగా రాపర్తి శిరీషను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

టీజేఎఫ్ రజతోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

వర్ధన్నపేట : తెలంగాణ జర్నలిస్టు ఫోరం (టీజేఎఫ్) హైదరాబాద్‌లో ఈనెల 31న నిర్వహించనున్న రజతోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే నాగరాజు శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రజతోత్సవాలకు జర్నలిస్టులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని టీజేఎఫ్ నాయకులు కోరారు.

అన్నదానం

గీసుకొండ : మండలంలోని కొమ్మాల గ్రామంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయం వద్ద వరంగల్ నగర శివారులోని గొర్రెకుంటకు చెందిన బొమ్మినేని విజయ మోహన్‌రెడ్డి దంపతులు శనివారం అన్నదానం చేశారు. ప్రతి శనివారం ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో శనివారాల్లో విజయ మోహన్‌రెడ్డి దంపతులు అన్నదానం చేస్తున్నారు. తొలుత ఆలయంలో విజయ మోహన్‌రెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు.

శిక్షణతో నైపుణ్యం పెంపు

నర్సంపేట : వేసవి శిక్షణతో విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందుతుందని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు నైపుణ్యాలు పెంపొందించడంతోపాటు సెల్‌ఫోన్ వంటి వాటికి దూరంగా ఉంచేలా శిక్షణ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. విద్యాసంస్థల కోశాధికారి డాక్టర్ వనజ మాట్లాడుతూ భగవద్గీత నేర్చుకోవడం వల్ల విద్యార్థులు విలువలతో కూడిన వ్యక్తిత్వం పెంపొందించుకుంటారని చెప్పారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, కోశాధికారి వనజ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి, ఏఓ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నర్సంపేట : చెన్నారావుపేటకు చెందిన పిట్టల విజయ క్యాన్సర్‌తో బాధపడుతూ శనివారం మృతి చెందగా ఆమె మృతదేహానికి మెపా జిల్లా అధ్యక్షుడు తాళ్ల రవీందర్, వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, తదితరులు నివాళులర్పించారు. అనంతరం విజయ కుమారుడైన సీనియర్ జర్నలిస్టు, మెపా డివిజన్ గౌరవ అధ్యక్షుడు కుమార్‌ను పరామర్శించి ఓదార్చారు.

అర్జీలు 1,389.. యూనిట్లు 400

- రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు
- ఇప్పటికే బ్యాంకుల్లో పూర్తయిన సిబిల్ స్కోర్ ప్రక్రియ
- జూన్ 2న ప్రొసీడింగ్ కాపీలు పంపిణీ



వేలేరు : ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ కార్పొరేషన్‌ల ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాసం పథకానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు వివిధ రుణాలను సబ్సిడీ ద్వారా ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రూ.50 వేల లోపు బ్యాంకు లింకేజీ లేకుండా పూర్తి సబ్సిడీతో, రూ.1 లక్ష నుంచి 4లక్షల వరకు ఇచ్చే రుణాలకు బ్యాంకు లింకేజీతో ఇవ్వనున్నారు. కాగా ఈ పథకానికి మండలంలోని నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అప్లికేషన్లను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయగా అధికారులు వాటిని పరిశీలించి మండలానికి కేటాయించిన రెండు బ్యాంకులు వేలేరు ఎస్‌బీఐ, కొత్తకొండ యూనియన్ బ్యాంకుల వారిగా విభజించి దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్ పరిశీలించేందుకు పంపించగా దాదాపు సిబిల్ ప్రక్రియ కూడా పూర్తి అయినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. ఈ పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం (జూన్ 2న) ప్రొసీడింగ్ కాపీలను అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

స్వీకరించిన దరఖాస్తులు

మండలంలో 14 గ్రామపంచాయతీల్లో ఆన్‌లైన్ ద్వారా మార్చి 17 నుంచి ఏప్రిల్ 14 వ తేదీ వరకు వివిధ కార్పొరేషన్లకు దాదాపు 1,389 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఇప్పటివరకు ఎంపీడీఓ కార్యాలయంలో 1,256 మంది దరఖాస్తులను అందించారు. బీసీ కార్పొరేషన్‌కు 745 మంది, ఎస్సీ కార్పొరేషన్‌కు 376, ఎస్టీ 192, ఎంబీసీ 13, ఈడబ్ల్యూఎస్ 23, మైనారిటీ కార్పొరేషన్‌కు 40 మంది దరఖాస్తు చేసుకున్నారు.

ఉన్నతాధికారులకు అందజేస్తాం..



ప్రభుత్వ ఆదేశాల మేరకు వివిధ కార్పొరేషన్ల ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మండలానికి కేటాయించిన రెండు బ్యాంకులకు పంపించాం. బ్యాంకుల్లో సిబిల్ ప్రక్రియ కూడా దాదాపు పూర్తి కావచ్చింది. వారు ఇచ్చిన జాబితాను త్వరలోనే ఉన్నతాధికారులకు అందజేస్తాం. ఎలాంటి పైరవీలకు తావులేకుండా అర్హులైన నిరుద్యోగులకు పథకం అందేలా చూస్తాం.

– లక్ష్మీప్రసన్న, వేలేరు ఎంపీడీఓ

ట్రాక్టర్ కిందపడి యువ రైతు మృతి

- వేసవి దుక్కి దున్నుతుండగా ఘటన
- నందనం గ్రామంలో విషాదఛాయలు
- బోరున విలపించిన కుటుంబ సభ్యులు

ఐనవోలు : వేసవి దుక్కి దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి యువ రైతు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని నందనం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బర్ల నాగరాజు(32) తన స్వంత వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం సాయంత్రం ట్రాక్టర్‌తో వేసవి దుక్కులు దున్నుతున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్‌ను స్టార్టింగ్‌లోనే ఉంచి పక్కన ఆపి నీళ్లు తాగేందుకు దిగుతుండగా ప్రమాదవశాత్తు గేరు పడింది. దీంతో అతడు టైరు కింద పడిపోగా కాలికి తీవ్ర గాయమైంది. కొద్ది సేపటి తర్వాత గమనించిన అతడి తండ్రి యాకయ్య వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లాడు. కాలి నరం తీవ్రంగా దెబ్బతినగా అధిక రక్తస్రావం అయ్యింది. కాగా చికిత్స పొందుతూ నాగరాజు మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



బర్ల నాగరాజు (ఫైల్)

బాలుడికి గాయాలు

నర్సంపేట రూరల్ : బైక్ ఢీకొని బాలుడికి గాయాలైన ఘటన నర్సంపేట మండలంలోని ముత్తోజిపేట శివారులోని ఇప్పల్‌తండా క్రాస్ రోడ్డు వద్ద శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఇప్పల్‌తండా శివారు కొండసముద్రంతండాకు చెందిన జాటోత్ అనూష శ్రీను దంపతుల రెండో కుమారుడు వినయ్‌కుమార్ తన నాయినమ్మతో కలిసి నర్సంపేటకు వెళ్లి తిరిగి ఆటోలో ఇప్పల్‌తండా క్రాస్‌కు వచ్చి రోడ్డు దాటుతుండగా మల్లంపల్లి నుంచి నర్సంపేట వైపు ప్రయాణిస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వినయ్‌కు గాయాలు కాగా స్థానికులు 108 అంబులెన్స్‌లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

సంక్షిప్తంగా

జీవితంపై విరక్తితో వృద్ధుడి ఆత్మహత్య



దామెర : అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని పులుకుర్తిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. పులుకుర్తి గ్రామానికి చెందిన కాశెట్టి ఆదిరెడ్డి (80) కొంత కాలంగా కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. కాగా చికిత్స నిమిత్తం వైద్యులను సంప్రదించినప్పటికీ నయం కాకపోవడంతో మానసిక ఒత్తిడికి లోనయ్యాడు. ఈ క్రమంలో ఈనెల 23వ తేదీన సాయంత్రం ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులు వెళ్లి చూసేసరికి మృతిచెంది ఉన్నాడు. మృతుని రెండో కుమారుడు రవీందర్ ఫిర్యదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిడుగుపాటుతో ఆవు మృతి



ఎల్కతుర్తి : రెండు రోజులుగా కురిసిన అకాల వర్షానికి భీమదేవరపల్లి గ్రామానికి చెందిన రైతు పోలు అయిలయ్య పాడి ఆవు శనివారం తెల్లవారుజామున పిడుగుపాటుతో మృతిచెందింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు అయిలయ్య వేడుకున్నారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి



శాయంపేట : మండలంలోని గంగిరేణిగూడెం గ్రామానికి చెందిన రైతు మాలోతు రాజేందర్ ఎద్దు మేతకు వెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తు 11కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ తగిలి విద్యుత్‌షాక్‌తో మృతిచెందినట్లు బాధితుడు తెలిపాడు. ఎద్దు విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

అయోధ్యకు సైకిల్ యాత్ర

శాయంపేట : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గెలవాలని మండలంలోని సూర్యనాయక్‌తండా గ్రామానికి చెందిన మాలోతు తిరుపతి సైకిల్‌పై అయోధ్యకు (1300కిలో మీటర్లు) యాత్ర చేసి శ్రీరామున్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సైకిల్ యాత్ర పూర్తి చేసుకుని గ్రామానికి తిరిగి వచ్చిన తిరుపతిని శనివారం బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు లావుడియ రవీందర్ శాలువాతో సత్కరించారు.

కాట్రపల్లిలో ఉచిత కంటి వైద్యశిబిరం



శాయంపేట : మండలంలోని కాట్రపల్లి గ్రామంలో హ్యూమన్‌రైట్స్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బానోతు దేవేందర్‌నాయక్ ఆధ్వర్యంలో ఎన్జీఓ పుష్పగిరి కంటి ఆస్పత్రి సికింద్రాబాద్ వారు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని 50 మందికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం దేవేందర్ నాయక్ మాట్లాడుతూ.. సర్వేంద్రియానం నయనం ప్రధానం అని పెద్దలు అన్నారని, మనిషికి కళ్లు చాలా ముఖ్యమని, ప్రతిఒక్కరూ కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ షేక్ గౌస్, మాజీ సర్పంచ్ ఒంటేరు వనమ్మవీరస్వామి, సునీల్, రాజ్‌కుమార్, కర్ణాకర్, వైద్యులు పాల్గొన్నారు.

డీఎల్‌పీఓ ఆకస్మిక తనిఖీ



శాయంపేట : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని శనివారం డీఎల్‌పీఓ రవిబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని, గ్రామంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి తడి, పొడి చెత్తను వేరు చేసి కంపోస్ట్ ఎరువును తయారు చేయాలని గ్రామపంచాయతీ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్, సిబ్బంది ఉన్నారు.

బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌ల నియామకం

ఐనవోలు : మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లను శనివారం నియమించింది. మండల వ్యాప్తంగా మూడు పోలింగ్ బూత్ స్టేషన్‌లకు ఒకరి చొప్పున 8మంది శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లను పార్టీ ఆదేశాల మేరకు నియమించినట్లు ఆ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి, మండల అధ్యక్షుడు మాదాసు ప్రణయ్ తెలిపారు. ఐనవోలు ఇన్‌చార్జ్‌గా గుండెబోయిన నర్సింహ, పున్నేలు, పెరుమాండ్లగూడెం మేర్గు అనిల్, పంథిని, చింతకుంట దొంతి రాజిరెడ్డి, కక్కిరాలపల్లి రాంనగర్ దండు రవి, నందనం, రెడ్డిపాలెం బుర్ర రమేశ్, ఒంటిమామిడిపల్లి, లింగమోరిగూడెం, ఉడుతగూడెం పెండ్లి తిరుపతి, వనమాల కనపర్తి, ములకలగూడెం దూసరి రాజేశ్, కొండపర్తి, నర్సింహులగూడెం కోట కిరణ్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పాన్నాల రాజు, మడ్డి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

కమలాపూర్ / ఐనవోలు : టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలను కమలాపూర్, ఐనవోలు మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ కూడలి వద్ద కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. రమేష్‌గౌడ్, చరణ్‌పటేల్, నారాయణరెడ్డి, చంద్రశేఖర్, రమేశ్, చంద్రమౌళి, తిరుపతి, సదానందం, రవి, మనీష్, సురేష్, శరత్, పర్శరాములుగౌడ్, కుమార్, ఏఎంసీ డైరెక్టర్లు శివకృష్ణగౌడ్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

'డిస్నీల్యాండ్' విద్యార్థినికి సైనిక్ స్కూల్‌లో సీటు



దామెర : మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో గల డిస్నీల్యాండ్ పాఠశాల విద్యార్థినికి సైనిక్ స్కూల్‌లో సీటు లభించినట్లు పాఠశాల యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. పాఠశాలలో 5వ తరగతి చదివిన గుగులోతు కృతిక ఇటీవల నిర్వహించిన సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఆరోతరగతికి అర్హత సాధించినట్లు పేర్కొంది. కాగా విద్యార్థిని పాఠశాల ముఖ్య సలహాదారులు దయ్యాల మల్లయ్య, సదయ్య, బాలుగు లక్ష్మీనివాసం, డైరెక్టర్లు శోభారాణి, రాకేశ్‌భాను, దీనేష్‌చందర్ తదితరులు అభినందించారు.

దాడికి యత్నించారని ఫిర్యాదు

నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని నెక్కొండ రోడ్డులోని సర్వే నంబర్ 601/1/1లో గుడిసెలు వేసుకున్న పేదలపై కాకతీయ నగర్‌కు చెందిన బైరబోయిన వెంకటయ్య, బాలయ్య, వినయ్, రాంప్రసాద్, బాలకిషన్‌తోపాటు మరి కొందరు శనివారం తెల్లవారుజామున దాడికి యత్నించారని ఆరోపిస్తూ సీపీఎం నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఈసంపెల్లి బాబు, కోరబోయిన కుమారస్వామి మాట్లాడారు. బైరబోయిన వెంకటయ్య, తదితరులు గుడిసెవాసుల మీద దాడి చేయడానికి మరణాయుదాలతో వచ్చారని తెలిపారు. గుడిసెవాసులు కేకలు వేయడంతో బెదిరింపులకు దిగుతూ కారులో పారిపోయారని చెప్పారు. గుడిసెవాసులకు రక్షణ కల్పించి దాడికి యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో నాయకులు ఫరీదా, వజ్జంతి విజయ, లక్ష్మి తదితరులున్నారు.

మెరుగైన విద్యాబోధనే ధ్యేయం



నర్సంపేట రూరల్ : మాట్లాడుతున్న ఎంఈఓ



నర్సంపేట : మాట్లాడుతున్న ఎంఈఓ సరళ

- ఎంఈఓలు సారయ్య, సరళ

నర్సంపేట/నర్సంపేట రూరల్ : విద్యార్థులకు మరింత మెరుగైన విద్యాబోధన అందించడమే ధ్యేయంగా ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ఏర్పాటు చేసినట్లు నర్సంపేట, చెన్నారావుపేట ఎంఈఓలు కొర్ర సారయ్య, బైరి సరళ తెలిపారు. సదరు మండలాల్లో ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన వృత్యంతర శిక్షణ శనివారం ముగియగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. ఉపాధ్యాయులు వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. టీఎల్ఎంను తప్పనిసరిగా ఉపయోగించి బోధించాలని, బోధనలో మెళకువలు పాటించలని కోరారు. విద్యార్థుల సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయులందరూ చొరవ చూపాలని ఆకాంక్షించారు.

ఇంత నిర్లక్ష్యమెందుకు : డీఎల్‌పీఓ



చికెన్ షాప్ యాజమానిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎల్‌పీఓ గంగా భవాని

వేలేరు : 'గ్రామంలోని వివిధ దుకాణాదారులకు ట్రేడ్ లైసెన్స్‌లు లేవు.. పారిశుద్ధ్యంపై పట్టింపులేదు. వైన్‌షాపు ఎదుట వాటర్ బాటిళ్లు, గ్లాస్‌లు, చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడే పడేసి ఉంది. పంచాయతీ సిబ్బంది తమాషా చూస్తున్నారా.. సదరు దుకాణాదారులకు నోటీస్‌లు జారీ చేయడండి.. పట్టించుకోకుంటే షాపులను సీజ్ చేయండి' అంటూ డీఎల్‌పీఓ గంగాభవాని పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని పలు షాపులను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి గ్రామపంచాయతీ ట్రేడ్ లైసెన్స్ అడగగా ఎవరకి లేకపోవడంతో ట్రేడ్ లైసెన్స్ ఎందుకు ఇవ్వడం లేదని పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా మండల కేంద్రంలో ఉన్న రెండు వైన్స్ షాపులకు చెందిన ఖాళీ సీసాలు, గ్లాస్‌లు, వాటర్ బాటిళ్లు, చెత్తచెదారం ఎక్కడ పడితే అక్కడ వేస్తుండటంతో వారిపై అసహనం వ్యక్తం చేశారు. కొంత మంది చికెన్ సెంటర్ నిర్వాహకులు వ్యర్థాలను గ్రామం పక్కనున్న వాగుల్లో వేస్తున్నారని స్థానికులు ఆమె దృష్టికి తీసుకురాగా వారికి నోటీసులు జారీ చేయాలని, వారు పట్టించుకోని పక్షంలో షాప్‌లను సీజ్ చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఓ చికెన్ షాప్ యాజమాని ఇంటి ఎదుటనే చికెన్ కడిగిన నీళ్లు ఉండటంతో డీఎల్‌పీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని ప్రధాన రహదారి వెంట డ్రైనేజీ లేకపోవడంతో ఇళ్లల్లో వాడుకున్న నీళ్లు రోడ్డుపై ప్రవహించకుండా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ఇంటి యాజమానులకు సూచించారు. అనంతరం గ్రామపంచాయతీలోని పలు రికార్డులను పరిశీలించి పారిశుద్ధ్య పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి రవికుమార్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను తరలించొద్దు

- ఎస్సై సురేశ్



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

వేలేరు : గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను తరలించొద్దని ఎస్సై అజ్మీర సురేశ్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పిస్తున్న క్రమంలో అటుగా ఓ గూడ్స్ వాహనంలో వెళ్తున్న ప్రయాణికులను గమనించారు. వాహనాన్ని ఆపుదల చేసి డ్రైవర్, ప్రయాణికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వాహనానికి జరిమాన విధించారు. మారోమారు గూడ్స్ వాహనంలో ప్రయాణికులను తరలిస్తే వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు నిబంధనలను అతిక్రమించొద్దని అన్నారు. అలాగే ఇతర వాహనదారులు మద్యం సేవించి వాహనం నడుపొద్దని, అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

వేలేరు : మండలంలోని కన్నారం శివారులో గల ప్రభుత్వ భూములను భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఇచ్చుల్లపల్లిలో ప్రభుత్వ భూములను సాగుచేసుకుని కేసుల పాలైన కుటుంబాలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చుల్లపల్లి గ్రామంలోని పేద కుటుంబాలు తాత,ముత్తాల కాలం నుంచి ప్రభుత్వ భూములను సాగుచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని, గ్రామానికి చెందిన కొంతమంది భూస్వాములు ఈ భూములు మావేనని పేదలపై కేసులు పెట్టి వారిని వేధిస్తున్నారని ఆరోపించారు. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూములు కొనుగోలు చేస్తున్నారని, వారిపై రెవెన్యూ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను నిరుపేద దళితులకు పంపిణీ చేయాలని లేనిపక్షంలో సీపీఐ(ఎం) ప్రజాపోరాటాలు చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాములు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కార్యదర్శి రవి, భూ పోరాట కమిటీ సభ్యులు లక్ష్మి, సాగర్, సమ్మక్క, నవరత్న, మణెమ్మతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మెటీరియల్ ధరలు కొనుగోలు చేసేలా ఉండాలి

- ఎంపీడీఓ, తహసీల్దార్



మాట్లాడుతున్న లక్ష్మీప్రసన్న

వేలేరు : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టనున్న నేపథ్యంలో మెటీరియల్ ధరలు లబ్ధిదారులకు కొనుగోలు చేసే విధంగా ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న సూచించారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్మిక శాఖ అధికారులు త్వరలోనే మేస్త్రీలతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్ కోమి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక, మొరం తరలించే వాహనదారుల నంబర్, ఇందిరమ్మ ఇంటి యాజమాని పేరు, ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారనే వివరాలను తప్పనిసరిగా తహసీల్దార్ కార్యాలయంలో, స్థానిక పోలీస్ స్టేషన్‌లో అందించాలని అన్నారు. గృహనిర్మాణ శాఖ డీఈ సిదార్థ్ నాయక్, కార్మిక శాఖ అధికారి చాణక్య, ఏఈ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మండలంపై తహసీల్దార్ నాగరాజు ముద్ర

- ఆయన సేవలను కొనియాడుతున్న స్థానికులు



సఫియాకు బ్యాగ్, నోట్స్, ఇతర స్టేషనరీ అందజేస్తున్న తహసీల్దార్ నాగరాజు (ఫైల్)

నడికూడ : ఉద్యోగంలో భాగంగా విధులు నిర్వర్తించడమే కాదు ప్రజాసేవలో కూడా పాలుపంచుకుంటానంటున్నారు తహసీల్దార్ నాగరాజు. నడికూడ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇటీవల కలెక్టరేట్‌కు బదిలీ అయ్యే వరకు తనకంటూ ఓ ప్రత్యేకత ఉందని నిరూపించుకున్నారు. ఆయన బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి సమయానికి రావడం, ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించడంతో ముందుండేవారని స్థానికులు కొనియాడుతున్నారు. ముఖ్యంగా మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న పేదంటి విద్యార్థిని సయ్యద్ సఫియా ప్రతిభను గుర్తించి బాలిక చదువుకు పేదరికం అడ్డు కాకూడదని 10వ తరగతి వరకు అయ్యే ఖర్చును తానే భరిస్తానని మాట ఇవ్వడంతో గ్రామ ప్రజలకు మరింత గౌరవం పెరిగిందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. అలాగే స్థానిక పభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్, గ్రంథాలయం ఏర్పాటు, విద్యార్థులకు స్టేషనరీ అందించడంతో పాటు పలు సామాజిక సేవలు అందించారు. దీంతో ఆయన సేవలను గుర్తించిన కలెక్టర్ ఉత్తమ తహసీల్దార్‌గా ప్రశంసపత్రం అందించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి పోర్టల్ పైలట్ ప్రాజెక్టు మండలంగా ఎంపిక చేయడంతో గడువులోపు భూ సమస్యలను పరిష్కరించడం, పలు అంశాల్లో ప్రత్యేకత చాటుకున్నారని ప్రజలు అభినందిస్తున్నారు.

మా పాప పేరిట ఆర్డీ కడుతున్నారు

నాకు ముగ్గురు పిల్లలు. కంకర బండ కొట్టుకొని జీవిస్తున్నాం. మా పాప సయ్యద్ సఫియా ప్రతిభను గుర్తించిన తహసీల్దార్ సార్.. 10వ తరగతి వరకు చదివిస్తానని హామీ ఇచ్చారు. మా పాప పేరటిట స్థానిక పోస్టాఫీస్‌లో ప్రతీ నెల ఆర్డీ కట్టుతున్నారు.

– అంకుస్‌బీ (సఫియా తల్లి, నడికూడ

ప్రణాళికతో ఉత్తీర్ణత ఖాయం

నర్సంపేట రూరల్ /ఖానాపురం : ప్రణాళికతో చదివితే ఉత్తీర్ణత ఖాయమని నర్సంపేట స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, ఎంఈఓ కొర్ర సారయ్య, ఖానా పురం ఎంపీడీఓ అంబటి సునీల్‌కుమార్ తెలిపారు. శనివారం 'స్ఫూర్తి' కార్యక్రమాల్లో పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు సూచనలు చేశారు.